




సిద్ధమవుతున్న వేదిక


గణతంత్ర వేడుకలకు సిద్ధం

● పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పూర్తి ● పతాకావిష్కరణ చేయనున్న కలెక్టర్

కర్నూలు(కల్చరల్), జనవరి 25: భారత 75వ గణతంత్ర వేడుకలకు కర్నూలు నగరం ముస్తాబైంది. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం 8:45 గంటలకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, 8:50 గంటలకు డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సెంథిల్‌కుమార్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు మైదానానికి చేరుకుంటారు. అనంతరం 8:55 గంటలకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన హాజరై 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం సాయుధ దళాలను పరిశీలించి, గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.13 గంటలకు కలెక్టర్ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ సందేశమిస్తారు. తర్వాత సాయుధ దళాల గౌరవవందనం, కలెక్టర్ సందేశం ఉంటుంది. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం, ప్రభుత్వ పథకాల శకటాల ప్రదర్శన ఉంటుంది. అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

ముప్పవ్వెన్నెల 'లోకాయుక్త'


కర్నూలు లీగల్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర లోకాయుక్త భవనం జాతీయ పతాక రంగులతో సిద్ధం చేశారు. శుక్రవారం రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.



తుది కసరత్తు..!

సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తోంది. ఫిబ్రవరి 20లోపు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసే అవకాశం ఉంది. ఆ దిశగా కసరత్తు జరుగుతోంది. అదే క్రమంలో ప్రధాన రాజకీయ పక్షాలు కూడా కురుక్షేత్ర సంగ్రామానికి సన్నద్ధమవుతున్నారు. గెలుపు గుర్రాల ఎంపికలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకునే లక్ష్యంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అభ్యర్థుల ఎంపికలో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రెండు మూడు నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు టికెట్ ఆశిస్తున్నారు. అదే క్రమంలో పొత్తుల్లో భాగంగా జనసేనకు కనీసం ఒక స్థానమైన ఇచ్చే అవకాశం ఉంది. ఆరేడు నియోజకవర్గాల్లో ఒకరే టికెట్ ఆశిస్తున్నారు. అలాంటి స్థానాల్లో అభ్యర్థులను తొలి జాబితాలో ప్రకటించే అవకాశం ఉందని పార్టీ నాయకులు అంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 సీట్లను క్లీన్‌స్వీప్ దిశగా టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అభ్యర్థుల ఎంపికపై తుది కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు అభ్యర్థులకు స్పష్టత ఇచ్చినట్లు సమాచారం.

- **టీడీపీలో కొలిక్కి వస్తున్న అభ్యర్థుల ఎంపిక**
- **మెజార్టీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పావులు**
- **ఆచితూచి అడుగులేస్తున్న అధిష్టానం**
- **షెడ్యూల్ తర్వాతే తొలి జాబితా ప్రకటించే అవకాశం**
- **మెజార్టీ స్థానాల్లో ఇన్‌చార్జిలకే చాన్స్**

కర్నూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలతోపాటు 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. టీడీపీ ఆవిర్భావం తరువాత ఆ పార్టీకి కంచుకోట. 2004 ఎన్నికల తరువాత టీడీపీ స్థానాలు తగ్గుతూ వచ్చాయి. 2019 ఎన్నికల్లో జగన్ ఒక్క చాన్స్ మంత్రం ఫలించడంతో టీడీపీ ఘోరంగా ఓటమి చెందింది. ఒక్క స్థానంలో కూడా గెలవలేకపోయింది. ఒక్క చాన్స్ అంటూ మాయ చేసిన జగన్ ఏదో చేస్తారనే ఆశతో వైసీపీకి క్లీన్‌స్వీప్ విజయం అందిస్తే.. ఆశలు ఎండమావులే అని తేలిపోయింది. అభివృద్ధి చేయకపోగా ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారు. ఇచ్చిన హామీలు అమలు చేయమని గొంతెత్తిన ప్రభుత్వ ఉద్యోగులు రోడ్లపైకి రాకుండా అడ్డంకులు సృష్టించారు. తెలంగాణ ప్రభుత్వం కంటే ఎక్కువ జీతం ఇస్తానంటివి.. ఆ మాట ఏమైందీ..? అని రోడ్డెక్కిన అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించారు. రాష్ట్రాన్ని జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మార్చేసి యువతను నిలువున ముంచేశారని.. ఇలా అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఇలాంటి అనుకూల పరిస్థితులను చేజార్చుకోకుండా మహా సంగ్రామం-2024లో క్వీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంగా టీడీపీ అధినేత చంద్రబాబు అభ్యర్థుల ఎంపికలో రాజకీయ, సామాజిక సమీకరణలు, సర్వేల నివేదికలను పరిగణలోకి తీసుకుని ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

టికెట్ ఎవరికి దక్కేనో..?

తెలుగుదేశం పార్టీ కర్నూలు నియోజకవర్గం ఇన్‌చార్జిగా టీజీ భరత్, ఎమ్మిగనూరు నియోజకవర్గం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జిగా పి.తిక్కారెడ్డి, కోడుమూరు (ఎస్సీ) ఇన్‌చార్జిగా ఆకెపోగు ప్రభాకర్, ఆదోని నియోజకవర్గం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, ఆలూరు నియోజకవర్గం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, పత్తికొండ ఇన్‌చార్జిగా కేఈ శ్యాంబాబు, పాణ్యం ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత కొనసాగుతున్నారు. జగన్ ప్రభుత్వం ఒత్తిళ్లు, వైసీపీ నాయకులు ఒత్తిళ్ల ఎదురొడ్డి ఐదేళ్ల పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లారు. యువగళం పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్‌లో జిల్లాలో సుదీర్ఘంగా సాగించిన పాదయాత్రను సక్సెస్ చేశారు. అధినేత చంద్రబాబు పాల్గొన్న బాదుడే బాదుడు, ఇదేమి ఖర్మ ఈ రాష్ట్రానికి.. వంటి కార్యక్రమాలను విజయవంతం చేశారు. దిగ్విజయం చేశారు. ప్రజలు, కార్యకర్తల్లో జోష్ పెంచేందుకు టీడీపీ నేతలు చురుకైన పాత్ర పోషించారు. కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ మినహా మిగిలిన ఏడుగురు 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసినవారే. ప్రస్తుతం రాష్ట్రంలో జగన్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత దృష్ట్యా టీడీపీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రభుత్వ ఇంటలిజెన్స్ వర్గాలే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఇన్నాళ్లు పార్టీ కోసం కష్టపడ్డాం.. మాకే టికెట్ ఇవ్వాలని ఇన్‌చార్జిలు కోరుతున్నారు. అయితే.. రాజకీయ, సామాజిక సమీకరణలు, సర్వే రిపోర్ట్ ఆధారంగా గెలుపు గుర్రాలు ఎంపికలో అధినేత చంద్రబాబు తుది కసరత్తు చేస్తున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో టికెట్ కోసం పోటీ అంతంతే. అక్కడ ఇన్‌చార్జిలకే స్పష్టత ఇచ్చారని అంటున్నారు. పత్తికొండ టికెట్ మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ఆశిస్తున్నా.. వారి కుటుంబమే తేల్చుకోవాలని సూచించినట్లు తెలుస్తుంది. మంత్రాలయం ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి టికెట్ నాకే అంటూ ధీమాగా ప్రజల్లోకి వెళ్తున్నారు. ఇక్కడ సీనియర్ నాయకుడు ఉలిగయ్య, ఇటీవలే పార్టీలో చేరిన మాధవరం రాఘవేంద్రరెడ్డిలు కూడా ఆశిస్తున్నారు. ఆదోని టికెట్ మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడుకు ఖరారు అయిందని ఆయన వర్గీయులు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. అయితే అదేస్థానం నుంచి టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, మదిరె భాస్కరరెడ్డిలు ప్రయత్నిస్తున్నారు. ఇక కోడుమూరు (ఎస్సీ) నుంచి ఇన్‌చార్జిగా ఆకెపోగు ప్రభాకర్, మాజీ ఇన్‌చార్జి ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి వర్గానికి చెందిన బొగ్గుల దస్తగిరి, బి.తాండ్రపాడు మాజీ సర్పంచ్ జయన్న, తెలుగుదేశం పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నేసపోగు కిరణ్మయి రేసులో ఉన్నారు. వీరితో పాటు వైసీపీ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యేలు మణిగాంధీ, మురళీకృష్ణ కూడా జిల్లా, రాష్ట్ర నాయకుల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు.

● కోట్ల కుటుంబం పోటీ ఖాయం.. కానీ...

రానున్న ఎన్నికల్లో కోట్ల కుటుంబం టీడీపీ అభ్యర్థులుగా బరిలో దిగడం ఖాయం. అయితే ఎక్కడి నుంచి పోటీ చేయించాలి అని అధిష్టానం ఆచితూచి అడుగులు వేస్తోంది. గత ఎన్నికల ముందు కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరిన కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలు ఎంపీగా, ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ప్రస్తుతం అదే స్థానాలు వారు ఆశిస్తున్నారు. అయితే రాజకీయ, సామాజిక సమీకరణాల దృష్ట్యా రానున్న ఎన్నికల్లో కర్నూలు ఎంపీ టికెట్ బీసీలకు ఇస్తారనే ప్రచారం ఉంది. కోట్ల కుటుంబం నుంచి ఎంపీగా పోటీ చేస్తారా..? ఆలూరు నుంచి బరిలో ఉంటారా..? అనే చర్చ జరుగుతోంది. తాజాగా డోన్ నుంచి పోటీ చేస్తే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి గెలిచే చాన్స్ ఉందని, అక్కడి నుంచి బరిలో దింపేదుకు రాష్ట్ర నాయకత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆలూరులో ఐదేళ్లుగా అధికార పార్టీ ఒత్తిళ్ల ఎదురొడ్డి కార్యకర్తలు, వర్గాన్ని బలోపేతం చేసుకున్నాం.. చివరి క్షణాల్లో ఆలూరు వదిలే ప్రసక్తే లేదని, ఇక్కడి నుంచే పోటీలో ఉంటామని ఆ పార్టీ ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ ధీమాగా ఉన్నారు. డోన్ నుంచి సూర్యప్రకాశ్‌రెడ్డిని అధిష్టానం బరిలో దింపినా ఆలూరు మాత్రం వదులుకోమని కోట్ల సుజాతమ్మ తన సన్నిహితులతో గట్టిగానే చెబుతున్నారు. దీంతో కోట్ల కుటుంబం ఏ స్థానాల్లో బరిలో ఉంటుంది..? అని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ఇక ఆలూరు టికెట్ కోసం నియోజకవర్గం టీడీపీ మాజీ ఇన్‌చార్జిలు బి.వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం జ్యోతిలు కూడా ఆశిస్తున్నారు. కోట్ల కుటుంబం ఎక్కడి నుంచి పోటీలో ఉంటుందనే దానిపై నాలుగైదు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. అధిష్టానం ఆలోచన మేరకు కోట్లను డోన్ నుంచి పోటీ చేయిస్తే.. ప్రస్తుత ఇన్‌చార్జి ధర్మావరం సుబ్బారెడ్డికి ఎలాంటి అవకాశాలు ఇస్తారోనని ఆయన వర్గీయులు చర్చించుకుంటున్నారు.



భక్త జన సంద్రం



అశేష భక్త జనవాహిని మధ్య కొనసాగుతున్న శాంభవీదేవి రథం

● ఘనంగా శాంభవీదేవి రథోత్సవం ● వేలాదిగా తరలి వచ్చిన భక్తులు


శాంభవీదేవి

కోసిగి, జనవరి 25: శాంభవీమాత క్షేత్రం ఆర్లబండ గ్రామం జనసంద్రమైంది. రథోత్సవం సందర్భంగా వేలాది మంది తరలిరావడంతో అమ్మవారి క్షేత్రం కిక్కిరిసింది. గురువారం సాయంత్రం సంధ్యా వేళ పున్నమి రోజున అమ్మవారి రథోత్సవం ఉత్సాహంగా సాగింది. మఠం పీఠాధిపతి మర్రిస్వామి తాత ఆధ్వర్యంలో ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తజన సందోహం మధ్య రథాన్ని ముందుకు లాగారు. ఈ వేడుకలను తిలకించేందుకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి, దివాకర్ రెడ్డి రథోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్, నరేంద్ర కుమార్ రెడ్డి, ఎస్‌బీ ఏఎస్ఐ డి.విజయకుమార్‌లు బందోబస్తు పర్యవేక్షించారు.


కొండలపై నిల్చొని రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



రథోత్సవంలో తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక!


సీఎం జగన్‌తో ఎర్రకోట, మాచాని తదితరులు

- **పట్టువీడి మెట్టు దిగిన ఎమ్మెల్యే ఎర్రకోట**
- **ఎర్రకోటతో బుట్టా ప్రత్యేక భేటీ**
- **తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్‌ను కలిసిన ఇద్దరు నేతలు**
- **మాచాని వెంకటేశ్‌కు నామినేటెడ్ పదవి?**

కర్నూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి)/ ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు వైసీపీలో సీట్లాట సస్పెన్స్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. జగన్ ఎంపిక చేసిన అభ్యర్థులను నెల రోజులు తిరగకుండానే రీసర్వేల పేరుతో మార్చేస్తున్నారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సిఫారసుతో డిసెంబరు నెల 29న ఎమ్మిగనూరు నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి)గా మాచాని వెంకటేశ్‌ను ఎంపిక చేశారు. ఆయన ఎంపికపై ఆ పార్టీలో వ్యతిరేకత తారస్థాయికి చేరింది. అప్రమత్తమైన పార్టీ రీసర్వే చేయించింది. ఆ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఎమ్మిగనూరుకు వస్తే.. మాచాని వెంకటేశ్ మాకొద్దు అంటూ తెగేసి చెప్పారు. వైసీపీ అధిష్టానం, ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఎట్టకేలకు దిగివచ్చారు. ఎమ్మెల్యే ఎర్రకోట, మాజీ ఎంపీ బుట్టా రేణుక సహా పలువురు నాయకులు గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో సీఎం జగన్‌ను కలిశారు. అభ్యర్థిగా బుట్టా రేణుక పేరు ఖరారు చేయగా మొదట్లో వ్యతిరేకించిన ఎర్రకోట ఒకే అనక తప్పలేదు. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అయితే ఇప్పటికే అభ్యర్థిగా ప్రకటించిన మాచాని వెంకటేశ్‌కు రాష్ట్రస్థాయిలో కీలకమైన ఓ నామినేటెడ్ పదవి కేటాయిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.





పట్టు సాధించిన బుట్టా రేణుక

ఎమ్మిగనూరు నియోజకవర్గం వైసీపీ టికెట్ దక్కించుకునేలా మాజీ ఎంపీ బుట్టా రేణుక పావులు కదిపారు. ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మాత్రం తన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని గట్టిగా పట్టుపట్టారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఎర్రకోట వయసు 84 ఏళ్లు. వయోభావరం వల్ల ఆయన గెలిచే పరిస్థితులు లేవని వైసీపీ భావిస్తోంది. అందుకే ఆయనకు సీఎం జగన్ టికెట్ నిరాకరించారు. బీసీ సామాజికవర్గానికి టికెట్ ఇస్తామని చెప్పడంతో మాజీ ఎంపీ బుట్టా రేణుక, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్‌లు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే వీరిద్దరికి కాకుండా బీసీల్లోనే తన మనిషిగా మాచాని వెంకటేశ్‌కు టికెట్ ఇస్తే గెలిపించుకు వస్తానని ఎమ్మెల్యే ఎర్రకోట సీఎం జగన్‌కు తేల్చి చెప్పడంతో మాచాని వెంకటేశ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఆయన ఎంపికపై తీవ్ర వ్యతిరేకత రావడంతో రీసర్వే నిర్వహించారు. ఈ క్రమంలో మాజీ ఎంపీ బుట్టా రేణుక విజయవాడలో తాడేపల్లి ప్యాలెస్‌కు పలుమార్లు వెళ్లి వైసీపీ పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎంఓ ఆఫీస్‌లో కీలక అధికారి ధనుంజయరెడ్డి తదితరులతో టికెట్‌పై చర్చించారు. రీసర్వేలో వెంకటేశ్‌కు టికెట్ ఇస్తే గెలిచే అవకాశం లేదని తేలడం, వైసీపీ ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు కూడా ధిక్కారస్వరం వినిపించడంతో ఎట్టకేలకు సీఎం జగన్, ఎమ్మెల్యే ఎర్రకోట దిగివచ్చారు.

ఎర్రకోటతో బుట్టా భేటీ!


మాజీ ఎంపీ బుట్టా రేణుక పేరు ఎత్తేందుకు ఇష్టపడని ఎమ్మెల్యే ఎర్రకోట ఆమెతో ప్రత్యేకంగా సమావేశంకావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. వైసీపీ అధిష్టానం నుంచి పిలుపు రావడంతో రెండు రోజుల క్రితమే ఎమ్మెల్యే ఎర్రకోట, ఆయన అల్లుడు మాజీ వైఎస్ ఎంపీపీ బనవాసి బసిరెడ్డి, కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి, తాజా వైసీపీ ఇన్‌చార్జి మాచాని వెంకటేశ్ సహా పలువురు ముఖ్య నాయకులు విజయవాడకు వెళ్లారు. బుట్టా రేణుక, ఎర్రకోటతో వైసీపీ పెద్దలు చర్చించినట్లు సమాచారం. బుధవారం విజయవాడలో ఉన్న ఎమ్మెల్యే ఎర్రకోట ఇంటికి మాజీ ఎంపీ బుట్టా రేణుక వెళ్లి ప్రత్యేకంగా సమావేశం అయ్యారని సమాచారం. టికెట్ విషయంలో తనకు సహకరించాలని విన్నవించినట్లు తెలిసింది. గురువారం సాయంత్రం 4 గంటలు తరువాత ఇద్దరూ కలిసి తాడేపల్లిలో సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం జగన్‌ను కలశారు.

మాచాని వెంకటేశ్‌కు నామినేటెడ్ పదవి?

అనుహ్య పలుపుల మధ్య ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థిగా తెరపైకి వచ్చిన మాచాని వెంకటేశ్ నెల తిరక్కుండానే అవుటయ్యారు. అయితే ఆయనకు ఓ నామినేటెడ్ పదవి ఇస్తానని సీఎం జగన్ స్పష్టంగా చెప్పారని, రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు కూడా వస్తాయని హామీ ఇచ్చినట్లు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. వైసీపీ టికెట్ ఆశించి భంగపడిన ఏపీ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఆసక్తిగా మారింది.

దీక్షతో మోక్షం

- జీవన చక్రంతో ముడిపడిన మండల దీక్ష
- శివనామస్మరణతో మానసిక ప్రశాంతత
- మొదలైన శివదీక్ష మాలధారణలు



ఆత్మకూరు, జనవరి 25:

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ దీక్షను ఆచరించేందుకు మల్లన్న భక్తులు సిద్ధమవుతున్నారు. శివదీక్షతో మోక్షప్రాప్తి, మానసిక ప్రశాంతత లభిస్తుందన్న సంకల్పంతో తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది శివభక్తులు దీక్షను స్వీకరిస్తున్నారు. నియమ నిష్టలతో దీక్షను పూర్తి చేసి ఈ ఏడాది మార్చి 8వ తేదీన జరిగే మహాశివరాత్రి నాటికి స్వామివారికి ఇరుముడి సమర్పించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని శివస్వాములు మండల దీక్షను పూనుకుంటుండటంతో ఆయా ప్రాంతాల్లోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. శివస్వాములు ఆచరించే మండల దీక్ష మానవ జీవన చక్రంపై ఆధారపడి ఉండేలా 48 రోజులుగా తొలుత ప్రారంభించారు. అంటే జీవన చక్రంలోని 9గ్రహాలు, 12 రాశులు, 27నక్షత్రాల మొత్తం 48 రోజులుగా పరిగణలోకి తీసుకుని మండల దీక్షను పూర్తి చేసేవారు. అయితే కాలక్రమంలో మండల దీక్ష 41 రోజులు, అర్ధమండల దీక్ష 21 రోజులతో పాటు 11 రోజులతో కూడిన శివదీక్షను భక్తులు ఆచరిస్తున్నారు. కొందరు కార్తీక మాసం నుంచే దీక్షను ఆరంభించి 108 రోజుల పాటు పరమశివున్ని ఆరాధిస్తారు.



పురాణ చరిత్రలోనే శివ దీక్షకు ప్రాచుర్యం

ఇతిహాస పురాణ చరిత్రల్లోనే శివ దీక్ష ప్రాచుర్యం పొందినట్లు విక్రమాదిత్యుని తామ్రశాసనం ద్వారా తెలుస్తోంది. శివదీక్షను చేపట్టిన వారిలో మొట్టమొదటి భక్తురాలు పార్వతీదేవిలో ఇందులో చెప్పబడింది. జగన్మాత పార్వతీదేవి కఠోరమైన శివదీక్ష చేపట్టి పరమశివుడి అనుగ్రహం వల్లే అర్ధాంగి అయినది. శివుని శరీరమందు అర్ధభాగం స్వీకరించుటచే పరమేశ్వరుడు కూడా అర్ధనారీశ్వరుడుగా మారాడు. కాగా బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుడు, అర్జునుడు, భక్తకన్నప్ప, పర్వతుడు, భక్తసిరియాలుడు వారు కూడా శివదీక్షను పాటించినట్లు విక్రమాదితున్ని గ్రంథంలో పేర్కొనబడింది. కార్తికేయుడు కూడా శివదీక్షను పూని దేవతాసిన్యాలకు అధిపతి అయ్యాడు. ఇంతటి దివ్యమహిమ గల శివదీక్ష ఎంతో ప్రాచీనమైందిగా చెప్పవచ్చు.

1994 నుంచి శ్రీశైలం మల్లన్న దీక్షలు ఆరంభం

ప్రాచీన గ్రంథాల్లో చెప్పబడిన శివదీక్షకు వున్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని 1994లో శ్రీశైలంలో అప్పటి ఈవో వంగాల శంకరరెడ్డి తొలిసారిగా ఆరంభించారు. అప్పట్లో ఆయన వివిధ ప్రాంతాలకు చెందిన పలువురి బ్రాహ్మణులతో చర్చించి శివదీక్ష ప్రాశస్త్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు సంకల్పించారు. తొలుత ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో శివభక్తులు దీక్షను స్వీకరించగా ప్రస్తుతం లక్షలాది మంది భక్తులు మల్లన్నను స్మరిస్తూ శివదీక్షను పూనుకుంటున్నారు. ఈ ఏడాది మహాశివరాత్రి నాటికి తెలుగు రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి లక్షలాది మంది శివస్వాములు రానున్నట్లు దేవస్థానం అధికారులు అంచనా వేశారు. కాగా ఇరుముడి సమర్పించేందుకు వచ్చే శివదీక్షాపరులకు శ్రీశైల దేవస్థానం వారు కొన్ని వెసులుబాట్లు కల్పిస్తున్నారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో కొద్ది రోజులపాటు ఉచిత స్పర్శ దర్శనాన్ని కల్పిస్తారు. అలాగే ఇరుముడి సమర్పించేందుకు శిబిరాలను ఏర్పాటు సిద్ధం చేస్తారు.



శివదీక్ష చివర్లో ఇరుముడి ధారణ

శివస్వాములు దీక్ష చివరి నాటికి ఇరుముడి ధారణతో శివుడి సన్నిధికి చేరుకుంటారు. ప్రత్యేకించి శ్రీశైలం మల్లన్నకు ఇరుముడి సమర్పించే శివస్వాములు ఎక్కువగా పాదయాత్రగా తరలి వెళ్తుంటారు. ఇందుకోసం గోధుమవర్ణం సంచిలో స్వామి అమ్మవారికి నివేదించేందుకు పూజా సరంజామతోపాటు నైవేద్యం తీసుకెళ్లడమే ఇరుముడి ధారణ. ఇందులో స్వామివారికి ఆవు నెయ్యి, తేనె, కుంకుమ, గంధం, విభూది, బిల్వం, అగరుబత్తులు, మూడు కొబ్బరికాయలు, కర్పూరంతోపాటు బియ్యం, 11 రూపాయల దక్షిణను మంత్రోచ్చారణతో గురుస్వామి చేతుల మీదుగా ఇరుముడిలో వేసుకుని తలపైకి ఎత్తించుకుని శివసన్నిధికి చేరుకుంటారు. స్వామివారికి ఇరుముడి సమర్పించిన తర్వాత మహాశివరాత్రి రోజు అర్ధరాత్రి లింగోద్భవం అనంతరం శివదీక్షను విరమిస్తారు.

శ్రీశైలం ఈవో చొరవతో 1994లోనే శివదీక్ష స్వీకరించాను



1994లో శ్రీశైలంలో ప్రారంభించిన శివదీక్షల్లో భాగంగా శ్రీశైలం దేవస్థానం ఈవో వంగాల శంకరరెడ్డి చొరవతో శివదీక్షను తొలిసారిగా స్వీకరించాను. అప్పట్లో ఆత్మకూరు పట్టణం నుంచి 25 మంది దాగా శివ దీక్షను స్వీకరించి పాదయాత్రగా శ్రీశైలానికి వెళ్లి మల్లన్నకు ఇరుముడి సమర్పించాం. మొదటిసారిగా శివ దీక్షను స్వీకరించిన శివస్వాములకు దేవస్థానం వారు సకల సదుపాయాలు కల్పించారు. అప్పటి నుంచి ఏటా శివస్వాముల సంఖ్య పెరగడంతో నేడు లక్షల మంది శివదీక్ష ఆచరిస్తున్నారు. శివదీక్షతో మోక్షప్రాప్తి కల్గుతున్నది మా అందరి విశ్వాసం.

- గరుడాద్రి సత్యనారాయణశర్మ, పురోహితులు, ఆత్మకూరు

శివస్వాములకు ఏలోటు రానివ్వం



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి వచ్చే శివదీక్షాపరులకు ఏలోటు రానివ్వకుండా దేవస్థానం తరుపున ఏర్పాట్లు చేస్తాం. మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా ఉచిత స్పర్శ దర్శనం కల్పించే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఇరుముడి సమర్పించేందుకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తాం. ఇరుముడి సమర్పణకు అర్చకులను నియమిస్తాం. కాలినడకన తరలివచ్చే శివస్వాములకు మరిన్ని సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

- డి.పెద్దిరాజు, శ్రీశైలం దేవస్థానం ఈవో

ఓటు హక్కును వినియోగించుకోవాలి

జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ పిలుపు



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన పిలుపునిచ్చారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు కేవీఆర్ కళాశాల, కొండారెడ్డి బురుజు మార్గాల నుంచి విద్యార్థులు ర్యాలీగా జిల్లా పరిషత్‌కు చేరుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశభవనంలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవాన్ని కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత ఓటు హక్కు గురించి చుట్టూ ఉన్న సమాజానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుంటేనే మన భవిష్యత్తు బాగుంటుందన్నారు. ముఖ్యగా గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం చాలా తక్కువగా ఉంటుందన్నారు. అలా కాకుండా పోలింగ్ శాతం పెరిగేలా యువత ఓటర్లను చైతన్యపరచి పోలింగ్ శాతం పెరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదనరావు, ఆర్డీఓ హరిప్రసాద్, నోడల్ ఆఫీసర్(ఎస్సీ కార్పొరేషన్ ఈడీ) శ్రీనివాసకుమార్, సెట్కూర్ సీఈఓ రమణ, కల్లూరు, కర్నూలు అర్బన్ తహసీల్దార్లు టీవీ రమేష్‌బాబు, విజయశ్రీ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆసరా కాదు టోకరా

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), జనవరి 25: మహిళలకు ఆసరా కాదు..జగన్ రెడ్డి టోకరా పెట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో డ్వాక్రా మహిళలకు పసుపు కుంకుమ కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు లబ్ధి చేకూర్చారని, జగన్ రూ.15 వేలు మాత్రమే ఇచ్చారని అన్నారు. అది కూడా కోటి 14 లక్షల మంది ఉంటే అందులో 33 లక్షల మందికి మొండి చేయి చూపారని తెలిపారు. మద్యం ధరలు పెంచి నాసిరకం మద్యాన్ని సరఫరా చేయించి భార్యా బిడ్డలకు ఖర్చు చేయాల్సిన సొమ్మును ఇలా మద్యం పేరుతో దోచుకుంటున్నారన్నారు. నాసిరకం మద్యం సేవించిన కారణంగా 35 లక్షల మందిని అనారోగ్యంపాలు నాశనం చేశారని, ఎంతో మంది మహిళల మాంగల్యాలను తెంచారని ఆరోపించారు. వివేకాను చంపిన నరహంతకులను కాపాడుతున్నారని, ఆస్తిలో భాగం ఇవ్వకుండా చెల్లిని గెంటేశారని విమర్శించారు. గతంలో చంద్రబాబు సున్నా వడ్డీ రుణాలను రూ.5 లక్షల వరకు వర్తింపజేస్తే జగన్ రూ. 3 లక్షలకు పరిమితం చేశారన్నారు. అది కూడా కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఉచితంగా ఇళ్లు ఇస్తానని చెప్పిన జగన్ ఓటీఎస్ పేరుతో ఒక్కొక్క దేశంలో మహిళల పట్ల జరిగే నేరాల్లో 3వ వంతు ఆంధ్రప్రదేశలోనే ఉన్నాయని తెలిపారు. జగన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు.

ఈ నెల 29 అగ్రిగోల్డు బాండ్లు వాపసు

కర్నూలు(లీగల్), జనవరి 25: లోపాలతో కూడిన అగ్రిగోల్డు బాండ్లను ఈ నెల 29 నుంచి వాపసు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన అగ్రిగోల్డు బాధితులు గతంలో న్యాయ సేవా సంస్థకు అందజేశారన్నారు. అయితే వాటిలో లోపాలు కలిగి ఒకటి కన్నా ఎక్కువ కలిగిన, రూ.10వేలలోపు కలిగిన బాండ్లను వాపసు చేయడానికి నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల అగ్రిగోల్డు బాధితులు ఈ నెల 29 నుంచి ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు తమ ఒరిజినల్ రసీదులను వాపసు చేసి బాండ్లను తీసుకెళ్లాలని ఆయన ప్రకటనలో తెలియజేశారు.

తహసీల్దార్ జయన్నకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ జయన్న

కోడుమూరు, జనవరి 25: ఓటరు నమోదు నిర్వహణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కోడుమూరు తహసీల్దార్ బి.జయన్నను ఉత్తమ పురస్కారం అవార్డు వరించింది. గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కార అవార్డుదును తహసీల్దార్ జయన్న అందుకున్నారు. తహసీల్దార్ జయన్న అవార్డు అందుకోవడం పట్ల కోడుమూరు డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, వీఆర్‌వోలు ఎల్లప్ప, నారాయణ, రామకృష్ణ, బీరప్ప, విశ్వనాథరెడ్డి, లాలప్ప, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, మధుమహేష్, రాముడు, హరికృష్ణ, సంజీవ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్

మాజీ మంత్రి మూలింటి మారెప్ప



మాట్లాడుతున్న మాజీ మాజీ మంత్రి మూలింటి మారెప్ప

ఆలూరు, జనవరి 25 : అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి మూలింటి మారెప్ప అన్నారు. గురువారం ఆలూరు పట్టణంలోని ఉమా కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం, ఇసుక, పేకాట, భూ కబ్జాలకు పాల్పడుతున్న అధికార పార్టీ నాయకుల అవీనీతికి అడ్డు లేకుండా పోయిందన్నారు. నరేంద్ర మోదీ ఓ కేడి అని, ఆయన వల్ల దేశం సర్వనాశనం అయిందన్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాబురావ్ మాట్లాడుతూ ఈ నెల 29న రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కర్నూలు జిల్లాకు రానున్నారని, అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పత్తికొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతినాయుడు, ఎస్సీ సెల్ నాయకులు లాజరస్, ఓబీసీ నాయకులు వెంకటరాముడు, ఐఎన్‌టీయూసీ నాయకులు బతకన్న, మైనారిటీ నాయకులు షేక్ ఖాజా మోహమద్దిన్ పాల్గొన్నారు.

సీమలో 47 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి

కర్నూలు, జనవరి 25: రాయలసీమ రేంజ్ పరిధిలో 47 మంది ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్ సంబంధిత డీఐజీలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఏ.జయన్న	సి.గోపినాథ్ రెడ్డి
యు.సద్గురుడు	కె.రారాజు
డి.మునిస్వామి	బి.మనోహర్
సి.నల్లప్ప	జి.మురళీకృష్ణ
జి.యువరాజు	ఏ.శ్రీరాముడు
ఏ.వేణుగోపాల్	బి.హేమకుమార్
క్రాంతి కుమార్	ఎం.సూర్యనారాయణ
ఎన్.జగదీష్	జె.విద్యాసాగర్
ఏ.మధు మల్లేశ్వరరెడ్డి	ఎం.రాజగోపాల్
పి.ఉమా	డి.శ్రీనివాసులు
మహేశ్వర రావు	హెచ్.కృష్ణం
ఏ.సంజీవకుమార్	రాజు నాయక్
ఎస్.జయచంద్ర	కొట్టం దస్తగిరి
టి.సుబ్బరామిరెడ్డి	మారుతి శంకర్
ఎస్‌కే. రోశన్	ఎం.రామయ్య
ఎల్.విజయలక్ష్మి	డి.హాజీవలి
ఏ.సునిత	ఆర్.మోహన్
ఎం.రాంభూపాల్	డి.మస్తాన్ వలి
టి.బాబు	ఏ.రామకృష్ణయ్య
బి.శ్రీకాంత్ రెడ్డి	ఎం.శాంతమ్మ
సి.ఎం.రాకేష్	ఎం.శ్రీధర్
ఏ.తిక్కస్వామి	పి.శేషగిరి
కె.నాగరాజు	వి.రామకృష్ణయ్య
ఎస్.కుల్లాయప్ప	జే.రమేష్ కుమార్
కె.జనార్దన్	



కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

సీఎంకు బొజ్జా దశరథరామిరెడ్డి లేఖ



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల టౌన్, జనవరి 25: కర్నూలు జిల్లాలోనే కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించబోతున్న రాయలసీమ నిజదర్శన దీక్షకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మద్దతు తెలిపే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం కృష్ణా బోర్డును విశాఖలో ఏర్పాటు చేయాలని కేంద్ర జల శక్తి శాఖకు సిఫారస్ చేయడం రాయలసీమ, ఏపీ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని రాయలసీమ సాగునీటి సమితి తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ ద్వారా కోరుతున్నట్లు వెల్లడించారు. శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తున్నామని, గతంలో సీఎం జగన్ శాసన సభలో వెల్లడించారని, మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న రాయలసీమ నిజదర్శన దీక్షను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దీక్షకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రహీం, మహిళా విభాగం కన్వీనర్ ప్రసన్నకుమారి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

రూ.1.35 లక్షల జరిమానా

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ దుకాణాలపై తూనికలు,కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. గురువారం అబ్బుల్లా ఖాన్ ఎస్టేట్, యుకాన్ షాపింగ్ ప్రాంతాలలో తనిఖీలు చేసి తయారీదారు వివరాలు, ఎమ్మార్పీ, కన్సూమర్ కేర్ నెంబర్ లేకపోవడంతో 14 కేసులు నమోదు చేసి రూ.1,35,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ దుకాణాల్లో తక్కువ ధరకే సెల్‌ఫోన్లు, పరికరాలు వస్తున్నాయని వాటికి తయారీదారు చిరునామా, ఎమ్మార్పీ లేకుండా కొనుగోలు చేయడం వల్ల వినియోగదారులు మోసపోతున్నారన్నారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

యువత చరిత్ర పుస్తకాలు చదవాలి

క్లస్టర్ యూనివర్శిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న క్లస్టర్ యూనివర్శిటీ వీసీ

కర్నూలు(కల్చరల్), జనవరి 25: యువత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను చదవాలని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. గురువారం నగరంలోని ఉస్మానియా డిగ్రీ కళాశాల చరిత్ర శాఖ ఆధ్వర్యంలో కర్నూలుకు చెందిన ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ రాసిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' స్వాతంత్ర్యోద్యమ నవల హిందీ అనువాద పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య సాయిగోపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో చరిత్రకు ఎక్కని అనేక ఘట్టాలను, వ్యక్తులను తన పరిశోధన రచనల ద్వారా నేటి తరానికి అందిస్తున్న అజీజ్ అభినందనీయులని అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సత్యనారాయణ రాజు జీవిత చరిత్రను యువత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బీఆర్ ప్రసాదరెడ్డి,కళాశాల కరస్పాండెంట్ అజ్రా జావేద్, కేవీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, ఉస్మానియా కళాశాల ఉపన్యాసకుడు సమీయుద్దీన్, మండి అన్వర్ హుస్సేన్, మసూద్ అహమ్మద్, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సత్యనారాయణరాజు కుమారుడు జితేంద్రనాథ్, మనుమడు ఏఎస్ రాజుల, సాహితీవేత్తలు చంద్రశేఖర కల్కూర, జుగర్ అహ్మద్, సుల్తాన్, గులాం హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

నంద్యాల క్రైం, జనవరి 25 : నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సురేంద్ర ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. సురేంద్ర వెళ్లిపోగానే రెక్కీ నిర్వహించి కాపుకాచిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 6 తులాల బంగారం, 400 గ్రాముల వెండిని దొంగలు అపహరించుకు వెళ్లారు. పని ముగించుకొని అరగంటలోనే ఇంటికి రావడంతో ఆ కాస్త సమయంలోనే పట్టపగలు దొంగలు పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. చోరీ జరిగిందని నిర్ధారించుకున్న సురేంద్ర టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓటే వజ్రాయుధం: ఆర్‌డీఓ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ఆర్‌డీఓ హరిప్రసాద్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం కొండారెడ్డిబురుజు నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయశేఖర్, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, తహసీల్దారు విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సుబ్బన్న పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల నుంచి సీ.క్యాంపు వరకు నిర్వహించిన ర్యాలీని డీవీఈవో కె.జమీర్‌ఫాషా ప్రారంభించారు. ర్యాలీలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



గూడూరులో..

● ఏ.క్యాంపులోని షైపర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జే.రవికుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ వెంకట రమణ సూచించారు. గురువారం గూడూరులో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ప్రాంతంలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్ మిన్నెల్లా హుసేన్‌కు తహసీల్దార్ సన్మానించారు. ఎంపీడీవో రాముడు, కమిషనర్ ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓటు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు, అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లో సచివాలయాల్లో, గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఆర్ఐ రంగస్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. గురువారం మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, విద్యార్థులు, ఏఎస్ఐ నాగన్న, పోలీసులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ సందీప్, సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు.


కొండారెడ్డిబురుజు వద్ద ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు


ఓర్వకల్లులో..



కర్నూలులో ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

వాల్మీకులను మోసం చేసిన జగన్: బీటీ నాయుడు

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 25: వాల్మీకులను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. గురువారం వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకుల రిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని అన్నారు. వైసీపీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి వాల్మీకుల గొంతు కోసిందని విమర్శించారు. కార్యక్రమంలో వినోద్ కుమారు, శ్రీనివాసులు, భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పతనం తప్పదు: టీడీపీ

కర్నూలు(రూరల్), జనవరి 25: రానున్న ఎన్నికల్లో వైసీపీకి పతనం తప్పదని టీడీపీ కోడుమూరు యువ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోకు సంబంధించిన సూపర్‌సిక్స్ పథకాలను కర్నూలు రూరల్ మండలం పంచలింగాల గ్రామంలో దస్తగిరి స్థానిక ఎంపీటీసీ నాగరాజుతో కలిసి గురువారం ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామంలో డ్రైనేజీ వ్యవస, సామూహిక మరుగుదొడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక పాయింట్ ప్రైవేట్ కంపెనీకి అప్పగించడంతో ఉన్న ఫలంగా ట్రాక్టర్లను అమ్మి వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృపానందం, మత్స్యకాంతరెడ్డి, గొల్లకృష్ణ, తిరుపాల్, తిమ్మప్ప, రఫీ, కృష్ణ పాల్గొన్నారు.











డ్యూటీ సమయంలో ప్రైవేటుకు..

విధులకు డుమ్మా కొట్టిన ఓ ప్రొఫెసర్..

కర్నూలు(హాస్పిటల్), జనవరి 25: కర్నూలు మెడికల్ కాలేజీలో పని చేస్తున్న ఓ ప్రొఫెసర్ ప్రైవేటు సేవల్లో మునిగిపోయారు. గురువారం ఉదయం 9 గంటలకు బయోమెట్రిక్ వేశారు. 3 గంటలు ఉండి ఓ ఆపరేషన్ నిమిత్తం నగరంలోని బిర్లా గేటు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిపోయారు. అక్కడ ఓ గర్భిణికి మత్తు మందు ఇచ్చారు. ఆపరేషన్‌లో పాల్గొన్నారు. విధులకు డుమ్మా కొట్టి ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్తున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇదే విషయంపై ప్రిన్సిపాల్ డా.పి.సుధాకర్‌ను వివరణ కోరగా.. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.


ప్రైవేటు ఆసుపత్రి వద్ద నిలిచి ఉన్న ఓ ప్రొఫెసర్ కారు

క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె విరమణ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: క్లాప్ ఆటో డ్రైవర్లు సమ్మెను విరమించారు. గురువారం అధికారులతో చర్చలు జరిపారు. ఒక్క నెల జీతం అందిస్తామని చెప్పడంతో డ్రైవర్లు సమ్మెను విరమించారు. ఈ మేరకు మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి 91 మంది ఆటో డ్రైవర్లకు ఒక్క నెల జీతం అందజేశారు. నెల జీతం ఇచ్చారని, మిగిలిన పెండింగ్ జీతాలు త్వరలో ఇస్తామని చెప్పడంతో సమ్మెను విరమించినట్లు డ్రైవర్ రఘుశేఖర్ తెలిపారు.

ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గీయుల సమావేశం

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గీయులు, వైసీపీలోని ఓ వర్గం నగరంలో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది. గురువారం రాత్రి పెద్దమార్కెట్ దగ్గర ఉన్న ఉర్దూఘర్ ఫంక్షన్ హాలులో వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే వర్గీయులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ఆరుగురు కార్పొరేటర్లు కూడా హాజరైనట్లు సమాచారం.

బకాయిలు విడుదల చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 25: పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ముందు పెన్షనర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్సీ అరియర్స్ చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన హాస్పిటల్‌లో వైద్యం అందించాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హృదయరాజు, వెంగల్‌రెడ్డి, కాశన్న పాల్గొన్నారు.

దోమల బారి నుంచి కాపాడాలి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: దోమల బారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఎం పాతబస్తీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సీపీఎం బృందంతో కలిసి హంద్రీనది, వక్కెర వాగులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ నగరంలో కొద్దిరోజులుగా దోమలు విపరీతంగా పెరిగాపోయాయన్నారు. టి.రాముడు, సీహెచ్.సాయిబాబ, కే.రామ క్రిష్ణ, ఉశేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ పత్రికపై కేసు నమోదు చేయాలి : టీడీపీ


కోడుమూరులో ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు, జనవరి 25: మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డిపై అధికార పార్టీ అనుకూలమైన పత్రికలో కోట్ల కుటుంబం టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తప్పుడు వార్త రాశారని, ఆ పత్రికపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీసులు స్టేషన్‌లో టీఎన్‌టీయూసీ తాలుకా అధ్యక్షులు గోపాల్ నాయుడు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచు కేశ రాంబాబు, సీబీలత మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఎల్లప్ప నాయుడు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఆంధ్రయ్య, తిరుమల్‌నాయుడు, రాఘవేంద్రయాదవ్, లక్ష్మయ్యశెట్టి, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిపై అధికార పార్టీ అనుకూలమైన పత్రికలో పార్టీ మారుతారని దుష్ప్రచారం చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు నారాయణ, అయ్యవారి నాయుడు, మధు, గోవిందు, కిశోర్ వర్మ పాల్గొన్నారు.

నగరంలో ముమ్మర తనిఖీలు

కర్నూలు, జనవరి 25: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలో ముమ్మరంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్ బృందం పలుచోట్ల తనిఖీలు చేపట్టింది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, పలు షాపింగ్ మాల్స్, ప్రధాన కూడళ్లలో ఈ తనిఖీలు చేశారు. ఏఆర్ఎస్ఐ నబీ రసూల్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 25: విశాఖపట్నం భీమిలిలో ఫిబ్రవరి 3, 4 తేదీల్లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ సబ్ జూనియర్ అండర్-14 పోటీలకు జిల్లా క్రీడాకారుల జాబితాను జిల్లా సంఘం కార్యదర్శి రామాంజనేయులు గురువారం విడుదల చేశారు.

● **జట్టు వివరాలు:** ఎం.భరత్, కె.సూరి, సి.మహేష్, కె.రామ్‌చరణ్ (ఆదర్శ విద్యామందిర్), అభిషేక్, రాజు, సీమన్, ప్రభుదాస్, (సీ.బెళగల్ ఏపీడబ్ల్యూఆర్), నిఖిల్ (నారాయణ స్కూల్), మనోజ్, రామ్‌కుమార్, వెంకటచరణ్ (జూపాడు బంగ్లా ఏపీఎస్‌డబ్ల్యూఆర్).

టీడీపీతోనే మహిళా సంక్షేమం: టీజీ భరత్


మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), జనవరి 25: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే మహిళా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 22వ వార్డులో ఆరోరా నగర్‌కు చెందిన మహిళలు మౌర్యా ఇన్‌లో టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, రోజురోజుకూ టీడీపీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కర్నూలులో తనను గెలిపిస్తే ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. కర్నూలులోని అన్ని ప్రాంతాల ప్రజలు తనకు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సుబ్బమ్మ, శ్రీధర్, విష్ణు, వంశీ, నవిత, దీపిక, చైతన్య పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన సీఐలు


డీఐజీ సెంథిల్ కుమార్‌తో సీఐలు

కర్నూలు, జనవరి 25: రాయలసీమ రేంజ్ పరిధిలో పదోన్నతి పొందిన 47 మంది సీఐలు గురువారం రాత్రి డీఐజీ సెంథిల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు భరోసాగా నిలుస్తూ పోలీసుశాఖ పారదర్శకత, జవాబుదారితనాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. రాబోయే ఎన్నికల్లో నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి

కర్నూలు(అర్బన్), జనవరి 25: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 29న కర్నూలు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు బాబురావు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆలూరు ముఖ్య నాయకుల సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి చిప్పగిరి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, లాజ రస్, డేగుల పాడు మంజునాథ్, పరదయ్యస్వామి, బోనాల బాలక్రిష్ణ, వినోద్ కుమార్, సంజప్ప పాల్గొన్నారు.

హంద్రీలో గుర్రపు డెక్క తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: నగరంలోని ఉస్మానియా కళాశాల, దండగేరి, జమ్మిచెట్టు తదితర ప్రాంతాలలో హంద్రీ నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను నగర పాలక సిబ్బంది తొలగించారు. యాంటిలైరల్ ఆపరేషన్‌లో భాగంగా గురువారం సీనియర్ ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హంద్రీ నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడమే కాకుండా దోమలు వ్యాప్తి చెంద కుండా ఆయిల్ బాల్స్, బిటి లిక్విడ్ వేశారు.

పేదలందరికీ పట్టాలివ్వాలి

ఓర్వకల్లు, జనవరి 25: అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని కోరుతూ గురువారం తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, మధుసూదన్ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మల్లేష్, మాసూంబాషా, నాగరాజు, శేషయ్య, జగన్నాథం పాల్గొన్నారు.

వేలంలో రూ.2.75 లక్షల ఆదాయం

కోడుమూరు(రూరల్), జనవరి 25: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి ఆలయంలో టెంకాయల విక్రయానికి గురువారం నిర్వహించిన వేలంలో రూ.2.75 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో గుర్రెడ్డి తెలిపారు. దేవదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో చేపట్టిన వేలంలో మద్దిలేటిరెడ్డి అనే పాటదారుడు కైవసం చేసుకున్నాడు. కాగా ఈనెల 29న మాధవస్వామి, వీరభద్రస్వామి ఆలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

● అనుమతించలేదని సర్పంచ్ అసంతృప్తి: టెంకాయల వేలంపై గ్రామ సర్పంచ్ సద్దల బాలక్రిష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆలయానికి భక్తులు విరాళంగా అందించిన గోవులు 20కి పైగా యథేచ్ఛగా పంటలపై వస్తున్నాయన్నారు. గోవుల సంరక్షణకు గోశాల నిర్మించాలని అధికారులకు విన్నవించడానికి వెళ్లగా పోలీసులు అనుమతించలేదని సర్పంచ్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్, జనవరి 25: మండల కేంద్రంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బాలరాముడు గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024- 2025 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఎంపీసీ, బైపీసీలకు 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ నమోదు చేసుకున్న దరఖాస్తులను ప్రిన్సిపాల్‌కు అందజేయాలన్నారు. ఫిబ్రవరి 23 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

కల్లూరు, జనవరి 25: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం చిన్నటేకూరు, బస్తిపాడు గ్రామాల్లో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా చిన్నటేకూరులో గ్రామసచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే బస్తిపాడులో హెల్త్‌క్లినిక్, రైతు భరోసాకేంద్రం, ఓహెచ్ఎస్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం తహసీల్దారు టీవీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో అర్హులకు ఎమ్మెల్యే ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో రమణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

మహిళలను మోసం చేసిన జగన్: గౌరు చరిత


మాట్లాడుతున్న గౌరు చరిత

కల్లూరు, జనవరి 25: జగన్‌రెడ్డి పాలనలో 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు ఆసరా ఇవ్వకుండా మోసం చేశారని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం తన స్వగృహంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహిళలను అన్ని రకాలుగా వంచించి వారి మాంగల్యాలు తెంచిన ఘనత జగన్‌కే సొంతమని గౌరు చరిత ఎద్దేవా చేశారు. మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి రూ.2 లక్షల విలువగల నాసిరకం మద్యం అమ్ముతున్నారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో సున్నా వడ్డీ రూ.5 లక్షలకు వర్తింపజేస్తే జగన్‌రెడ్డి దాన్ని రూ.3 లక్షలకు కుదించి మోసం చేశారన్నారు. ఉచితంగా ఇళ్లు అని నమ్మించి ఓటీఎస్ పేరుతో మహిళల నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేలు బలవంతంగా వసూలు చేశారని, టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన టిడ్కో ఇళ్లు పంపిణీ చేయలేదని అన్నారు. పెళ్లి కానుక పథకానికి కఠినతరంగా నిబంధనలు విధించి ఆడపిల్లలకు నష్టం కలిగించారని, అంగన్‌వాడీలకు చంద్రబాబు రూ.6,300 జీతం పెంచగా, జగన్ రూ వెయ్యి మాత్రమే పెంచారన్నారు. సమావేశంలో లింగారెడ్డి, శివారెడ్డి, కాంతారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు భద్రత కల్పించండి

కర్నూలు, జనవరి 25: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 28, 29 తేదీల్లో పత్తికొండలో పర్యటిస్తున్న సందర్భంగా తగిన పోలీసు బందోబస్తు కల్పించాలని కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బీటీ నాయుడు కోరారు. గురువారం ఆయన కర్నూలు అడిషినల్ ఎస్పీ నాగరాజును కలిసి లేఖ ను అందించారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు ధరూర్ జేమ్స్, నాయకులు తిలక్, కృష్ణ, షేక్షావలి ఉన్నారు.

సభను విజయవంతం చేయాలి

గూడూరు, జనవరి 25: తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమంలో భాగంగా పత్తికొండలో ఈనెల 28న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్ర బాబు నాయుడు తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్, పార్టీ అబ్జర్వర్ పెరుగు పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కోడుమూరు నియోజకవర్గం నుంచి జన సమీ కరణ ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈసమావేశంలో టీడీపీ నాయకులు మన్నన్ బాషా, నాగప్ప యాదవ్, శాంతరాజు, గిడ్డయ్య, రెహమాన్, రవి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో అధికారుల బదిలీలు ?

కర్నూలు(న్యూసిటీ), జనవరి 25: నగర పాలక సంస్థలో పని చేస్తున్న ముగ్గురు అధికారులను బదిలీ చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వుల రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, సెక్రటరీలను బదిలీ చేయనున్నట్లు తెలిసింది. అడిషనల్ కమిషనర్ దీర్ఘకాలంగా ఇక్కడే విధులు నిర్వహిస్తుండటంతో బదిలీ అనివార్యమైంది. ఈ క్రమంలో గుంతకల్ మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న షేక్ మాలిక్‌ను గత సంవత్సరం జూన్‌లో కార్పొరేషన్‌కు సెక్రటరీగా నియమించారు. ఆయన వచ్చి సంవత్సరం కూడా కాలేదు. అయితే అనారోగ్యకారణాల వల్ల బదిలీ చేయనున్నట్లు తెలిసింది. డిప్యూటీ కమిషనర్ ఈ సంవత్సరం జూన్‌లో పదవీ విరమణ పొందనున్నారు. అయితే డీసీ కార్పొరేషన్‌కు వచ్చి కేవలం నాలుగు నెలలు అవుతోంది. అయితే డీసీపై కమిషనర్ ఆగ్రహంగా ఉన్నందుకే బదిలీ తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏసీ, డీసీల బదిలీలు అనివార్యమైతే అనంతపురం కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఏసీ, డీసీలు ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పే స్కేలు అమలు చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), జనవరి 25: పే స్కేలు అమలు చేయాలని సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వాల్మీకి సర్కిల్‌లో మూడో రోజు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సీలింగ్ విధానానికి బదులుగా 100 శాతం బేసిక్‌పై ఈపీఎఫ్ కంట్రిబ్యూషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణుడు, రెహమాన్, రాఘవేంద్ర, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్యాస్ట్రో ఎంట్రాలజీ డీఎం పరీక్షల్లో విద్యార్థుల సత్తా

కర్నూలు(హాస్పిటల్), జనవరి 25: గ్యాస్ట్రో ఎంట్రాలజీ సూపర్ స్పెషాలిటీ డీఎం పరీక్షల్లో వైద్య విద్యార్థులు రాకేష్‌రెడ్డి, బిలాల్ మొహీద్దీన్ ప్రతిభ కనబరిచినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వీ వెంకటరంగారెడ్డి తెలిపారు. విశాఖపట్నంలో ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహించిన పరీక్షల్లో డా.షేక్ బిలాల్ మొహీద్దీన్ అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. మరో విద్యార్థి డా.రాకేష్ రెడ్డి థియరీలో టాప్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఐదో బ్యాచ్ డీఎం గ్యాస్ట్రో ఎంట్రాలజీ పూర్తి చేసుకున్న విద్యార్థులను సూపరింటెండెంట్ అభినందించారు.

ముగిసిన వైద్యుల నైపుణ్య శిక్షణ

కర్నూలు(హాస్పిటల్), జనవరి 25: కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో మూడు రోజులుగా వైద్యులకు నిర్వహిస్తున్న బీసీఎం కోర్సు శిక్షణ ముగిసింది. గురువారం సాయంత్రం జరిగిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రిన్సిపాల్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ హాజరై మాట్లాడారు. వైద్యవిద్యార్థులకు ఉత్తమ బోధనను అందించేందుకు ప్రొఫెసర్లు ఎప్పటికప్పుడు తమ బోధన సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. శిక్షణ అనంతరం 30 మంది వైద్యులకు వారు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ అబ్జర్వర్ ఎస్‌బీవీ చంద్రశేఖర్, మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ కోఆర్డినేటర్ డా.సింధియా పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఓర్వకల్లు, జనవరి 25: విజయవాడలో ఫిబ్రవరి 4న జరిగే గ్రామీణ వైద్యుల మహాసభను జయప్రదం చేయాలని గ్రామీణ వైద్యుల పోరాట సభ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి కోరారు. గురువారం ఓర్వకల్లులో మహాసభకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గ్రామీణ వైద్యులు ఈ సభను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, ఎండీ యూసుఫ్, ఎంవీ రమణ, రంగన్న, కొంతయ్య, ఎస్‌వీ రమణ, గోపాల్, సుభాన్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

‘టీడీపీతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం’


మాట్లాడుతున్న తిక్కారెడ్డి

పెద్దకడుబూరు, జనవరి 25: బీసీలు రాజకీయ ఎదుగుదల జరగాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి అన్నారు. పెద్దకడుబూరులోని మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేరుకే కార్పొరేషన్లు అని, వాటిని నిర్వీర్యం చేశారని అన్నారు. నియోజకవర్గంలో సారా, ఇసుక, దందా వాటి మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత వలస పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 28న పత్తికొండలో జరిగే రా కదిలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీ నాయకులు సత్రం రామకృష్ణ, నరసింహులు, మల్లికార్జున, టీడీపీ నాయకులు ఏసేబు, మీసేవ ఆంజినేయులు, వీరేష్ గౌడ్, సత్యన్న గౌడ్, దశరథరాముడు, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నరసింహారెడ్డి, అంజి, బొగ్గుల నరసన్న పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం


విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

ఎమ్మిగనూరు, జనవరి 25: ఎమ్మిగనూరులో నీలకంఠేశ్వరుని ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటిరోజు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పుష్పరథంపై ఊరేగించారు. రాత్రి ఆలయంలో వరుడు మహాశివుడి తరుపున గడిగె కుటుంబానికి చెందిన వారు, వధువు పార్వతీదేవి తరుపున బండ కుటుంబానికి చెందినవారు పెద్దలుగా వ్యవ హరించి వివాహ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మాచాని నీల మురళీధర్ దంతులు పట్టువస్త్రాలను సమర్పించారు.

ధార్మిక కార్యక్రమాలతోనే ప్రశాంతత

ఆదోని టౌన్, జనవరి 25: ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో ప్రశాంతత లభిస్తుందని కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్ద దేవరు మహాస్వామి అన్నారు. గురువారం వీరశైవ కల్యాణ మండపంలో ఉత్తమ మార్కులు సాధించిన వీరశైవ విద్యార్థులకు అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు దండిన శివానందరావు, రాష్ట్ర కార్యదర్శి దేశాయి చంద్రన్న, జంగమ సంఘం అధ్యక్షుడు గురునాథయ్య మాట్లాడారు. మహాసభ జాతీయ కార్యదర్శి రేణుక ప్రసన్న, మల్లికార్జునస్వామి, వీరశైవ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, గూళ్యం శివరుద్రప్ప, సుగురప్ప పాల్గొన్నారు.

రైతులు మానసికంగా ధృడంగా ఉండాలి

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 25: రైతులు పంటలు నష్టపోయామని కుమిలిపోకుండా మానసికంగా ధృడంగా ఉండాలని సైకియాట్రిస్ట్ డా చైతన్య నేరెళ్ల ఆక్టర్ వెంకట సుబ్బయ్య అన్నారు. గురువారం మార్కెట్ కమిటీలో రైతులకు జిల్లా మానసిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. మార్కెట్ యార్డు చైర్మన్ మజహార అహ్మద్, శాంత కుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు, జనవరి 25: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పెన్షనర్లు నిరసన తెలిపారు. అనంతరం స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ రెడ్డి, గోవిందప్ప మాట్లాడుతూ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు చెల్లించాలని అన్నారు. 11వ పీఆర్సీ అరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. హెల్త్‌కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పెన్షనర్లు ఆనంద్ రావు, మజార్ బాషా, ఈరన్న, చంద్రశేఖర్ స్వామి, గౌసిద్దయ్య, తిమ్మప్ప పాల్గొన్నారు.

పత్తికొండటౌన్: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు టీఎండీ హుసేని, ఎన్జీవో సంఘం నాయకుడు సాయిబాబా, వెంకట రమణ, రమేష్, నాగరాజు, నాగేంద్ర డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్డీవో రామలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు.

ఎమ్మిగనూరు: దీర్ఘకాలికంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏపీ వీరన్న ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు పెన్షనర్లు ధర్నా చేశారు. నాయకులు అబ్దుల్ కరీం, శ్రీనివాసులు, కృష్ణయ్య, జేపీసీ అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి వీడాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు సుందరీ బాయి, సుందరరాజు, అనుమప్ప, మల్లికార్జున, వర్మ, జగదీష్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలి

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 25: కార్పొరేట్ విద్యాసంస్థలో ముందస్తు అడ్మిషన్లను అడ్డుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. గురువారం డిప్యూటీ ఈవో కార్యాలయం వద్ద పీడీఎస్‌యూ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల్లో అకాడమిక్ ఇయర్ ప్రారంభం కాకముందే ముందస్తుగానే అడ్మిషన్లను చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం కార్యాలయం సీసీ చంద్ర శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు

ఆదోని రూరల్, జనవరి 25: భర్త, అత్తా మామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని గీత అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సలకల కొండకు చెందిన గీతకు పెద్దకడుబూరు మండలం బసలదొడ్డికి చెందిన ముని స్వామితో నాలుగేళ్ల క్రితం వివాహ మైంది. కొన్ని రోజులుగా తనను భర్తతో పాటు అత్తా మామలు అదనంగా కట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నారని గురువారం తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు

హొళగుంద, జనవరి 25: మండలంలోని నేరణికి గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గురువారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాంనీలను వివరణ కోరగా సర్పంచ్‌తో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

» సబ్ కలెక్టర్ నారాయణ్ శర్మ

ఆదోని టౌన్, జనవరి 25: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ్ శర్మ సూచించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భం గా పట్టణంలో అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాధాన్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంపీడీవో గీతావాణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

హాలహర్వి: సామాన్యులకు ఓటు వజ్రాయుధమని తహసీల్దార్ మల్లికార్జున అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది తలరాతలు మార్చే శక్తి ఓటు హక్కుతో సాధ్యమౌతుందన్నారు. అనంతరం అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంథోని పాల్గొన్నారు.

మద్దికెర: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని 1999 10వ తరగతి పూర్వపు విద్యార్థులు, సాయి ట్యూటోరియల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాల యం ఎదుట ప్రధాన బస్టాండ్ వద్ద గల మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు.


కోసిగిలో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ రుద్రగౌడు, విద్యార్థులు

వెల్దుర్తి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శివరా ముడు అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్ఐ మస్తాన్, విఆర్వోలు ప్రసాద్, ఎల్లకృష్ణ, ఉమన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలూరు: ఓటు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లికార్జున అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, అధ్యాపకులు కృపాకర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్, టీడీపీ మండల కన్వీనర్ అశోక్ యాదవ్, రాము పాల్గొన్నారు.

హొళగుంద: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని తహసీల్దార్ హుస్సేన్ సాబ్ అన్నారు. గురువారం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎం నజీర్ అహ మ్మద్, ఆర్ఐ దినేజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఓటు వజ్రాయుధంలాంటిదని జడ్పీ సీఈవో నాసరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవోవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో నీలకంఠ అన్నారు. గురువారం గోనెగండ్లలో ఉన్నత పాఠ శాల విద్యార్థులతో గోనెగండ్లలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాంగణం దగ్గర మానవహారం ఏర్పాటు చేశారు.

కోసిగి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ రుద్రగౌడు సూచించారు. గురువారం కోసిగిలో తహసీల్దార్ రుద్రగౌడు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, బాలురు, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోసిగిలోని వాల్మీకి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బాలుర పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్, ఆర్ఐ శ్రీరామ్ పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్


గోనెగండ్లలో ప్రతిజ్ఞ చేస్తున్న జడ్పీ సీఈవో నారసరెడ్డి, అధికారులు



ఆలూరులో..

28న పత్తికొండలో చంద్రబాబు ‘రా కదలిరా’

» టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు

పత్తికొండ, జనవరి 25: టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు చేపట్టిన ‘రా కదలిరా’ కార్యక్రమం ఈ నెల 28న పత్తికొండలో ఉంటుందని ఆపార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కేఈ శ్యాంబాబు తెలిపారు. గురువారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. చంద్రబాబు చేపట్టిన ‘రా కదలిరా’ పర్యటన 25వతేదీ పత్తికొండలో జరగాల్సిఉండగా అనివార్యకారణాలవల్ల వాయిదా పడిందన్నారు. పార్టీకార్యాలయం నూతనషెడ్యూల్‌లో 28వతేదిన పత్తికొండలో ‘రా కదలిరా’ కార్యక్రమం విడుదలకు షెడ్యూల్ ఖరారు చేసిందన్నారు. ‘రా కదలిరా’ కార్యక్రమానికి సంబంధించి బహిరంగసభ నిర్వహణకు ఆదోని రహదారిలో పెట్రోల్‌బంక్ పక్కన స్థలాన్ని ఎంపిక చేయడం చేసినట్లు తెలిపారు. ‘రా కదలిరా’ కార్యక్రమ నిర్వాహణ కమిటీ సభ్యులు స్థలపరిశీలనచేసి బహిరంగసభ నిర్వహణ, హెలిపాడ్ ఏర్పాటుకు సంబంధించి రూట్‌మ్యాప్ సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

‘రా కదలిరా’ ఏర్పాట్ల పరిశీలన: 28న పత్తికొండలో ‘రా కదలిరా’ బహిరంగసభ నిర్వహణ ఏర్పాట్లను గురువారం కేఈ శ్యాంబాబు పరిశీలించారు. టీడీపీ నాయకుడు ప్రమోద్ కుమార్‌రెడ్డికి చెందిన 16 ఎకరాల స్థలంలో ముళ్లకంచెలు, రాళ్లతొలగింపును ఎక్స్‌కవేటర్‌ద్వారా చేపట్టారు. నిర్వహణ కమిటీ ఇచ్చిన రూట్‌మ్యాప్‌కు అనుకూలంగా పనులు చేపట్టాలని పార్టీ వర్గాలకు తెలిపారు. పత్తికొండ టౌన్ సీఐ మురళీమోహన్ హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు.

బీసీల ద్రోహి జగన్: కేఈ శ్యాంబాబు

తుగ్గలి: బీసీల ద్రోహి సీఎం జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండలంలోని జొన్నగిరిలో జయహో బీసీ కార్యక్రమంలో ఆయ న మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలను అణిచివేశారని, బీసీలకు అందాల్సిన రుణాలన్ని కాజేశారని అన్నారు. దివంగత ఎన్‌టీ రామారావు బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించారన్నారు. టీడీపీ హయాంలో చెరువుల అభివృద్ధి చేస్తే వైసీపీ ప్రభుత్వం రూ.36కోట్ల పనులు చేయకుండానే స్వాహా చేశారని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అక్రమార్కులపై కేసులు వేసి అవినీతి సొమ్మును కక్కిస్తామని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు తిరుపాలునాయుడు, బాలన్న, రవి యాదవ్, సంగాల కృష్ణ, చంద్రశేఖర్‌యాదవ్, రామపురం మాజీ సర్పంచ్ చంద్రన్న, వెంకటస్వామి, బలరాముడు, శేఖర్, రామునాయక్, భీమలింగప్ప చౌదరి, రాంపురం మల్లయ్య, డీలర్ సుంకన్న, సర్పంచ్ ఓబులేసు, మల్లి పాల్గొన్నారు.


బహిరంగసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేఈ శ్యాంబాబు

కాంగ్రెస్‌తోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాబురావు

ఆదోని టౌన్/ పత్తికొండ టౌన్, జనవరి 25: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాబురావు, మాజీ మంత్రి మారెప్ప అన్నారు. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకమ్మ, ఉపాధ్యక్షుడు జయరాం, మైనారిటీ జిల్లా నాయకుడు అబ్దుల్, మారుతిరావు, ఆదినాయణ పాల్గొన్నారు.

షర్మిల పర్యటనను విజయవంతం చేయండి: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 29న కర్నూలు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు బాబురావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు అధ్యక్షతన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ పట్టణం గుత్తి రోడ్డులో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైన రాజారెడ్డి నగర్ కాలనీని కాంగ్రెస్ బృందం నాయకులు సందర్శించారు. మాజీమంత్రి మారెప్ప, లాజరస్, వెంకట్, విక్రమ్‌నాయుడు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

మద్దికెర, జనవరి 25: మద్దికెరలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని టీడీపీ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ రాజన్నయాదవ్ కోరారు. గురువారం మద్దికెర గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన అక్రమ నిర్మాణాలు చేపట్టారని గ్రామస్థులు అశోక్‌రెడ్డి, ఆదినారాయణ, కృష్ణ, హనుమప్ప ఫిర్యాదు చేయడంతో ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీదేవి సర్వే ద్వారా కొలతలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దికెర సాయినగర్ నుంచి మద్దికెర చివరకు రోడ్డుకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీదేవి మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు చేస్తే తొలగిస్తామని హెచ్చరించారు. రామాంజినేయులు, రాజశేఖర్, సర్వేయర్ బాలు, మాజీ ఉపసర్పంచ్ వెంకటరామిరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

సమ్మెలో సెర్ప్ ఉద్యోగులు

కోసిగి, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమానికే అధికారులు నిరసన వ్యక్తం చేశారు. అయితే ఆ శాఖకు సంబంధించిన అధికారులు మాత్రం కార్యక్రమంలో పాల్గొనలేదు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి గురువారం కోసిగిలోని మార్కెట్ యార్డులో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమంలో పాల్గొని మండలంలోని 870 పొదుపు సంఘాలకు రూ.5,00,96,859 జమ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉండాల్సిన సత్యమ్మ, వెలుగు సీసీలు సమ్మెలో ఉండడటంతో ఈ కార్యక్రమానికి వచ్చిన పొదుపు మహిళలు సైతం అధికారులే సమ్మెలోకి వెళ్లడంతో ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో అంటూ పొదుపు మహిళలు చర్చించుకున్నారు. వ్యవసాయ మండల అధ్యక్షులు మురళీరెడ్డి, ఎంపీపీ ఈరన్న, బెట్టన్నగౌడు పాల్గొన్నారు.

మూడో రోజూ ఆరుబయటే విధులు

మాట వినలేదని వేధింపులు ● పిల్లలు, బాలింతల పడిగాపులు

మద్దికెర, జనవరి 25: అంగన్‌వాడీ వర్కర్లపై కక్ష సాధింపు ధోరణి కొనసాగుతోంది. మద్దికెరలో మూడో రోజు ఆరుబయటే విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి నెలకొంది. తమ న్యాయమైన డిమాండ్ల కోసం 40 రోజులకు పైగా సమ్మె చేసిన విషయం విదితమే. సమ్మె కాలంలో తమ మాట వినలేదని, చెప్పిన పని చేయలేదని ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమ్మె అనంతరం విధుల్లో చేరినా గురువారం కూడా కేంద్రాల తాళాలు సచివాలయ ఉద్యోగులు ఇవ్వలేదు. దీంతో ఆరుబయట కూర్చుని ఎండకు, గాలికి పిల్లలు, బాలింతలను పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడింది. మదనంతపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి తాళాలు ఇవ్వకపోవడంతో కేంద్రాల్లోని పౌష్టికాహారాన్ని పంపిణీ చేయలే కపోయారు. ఈ విషయంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్య లక్ష్మిని వివరణ కోరగా అంగన్‌వాడీ నిర్వాహకులందరికీ సమాచారం ఇచ్చామని, సచివాలయ ఉద్యోగుల వద్దకు వెళ్లి తాళాలు తెచ్చుకోమని తెలిపామని పేర్కొన్నారు.

టీడీపీలో చేరిక


జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 25: నందవరం మండలం కనకవీడు పేట గ్రామ సర్పంచ్ సరస్వతి భర్త, వైసీపీ నాయకుడు ఉదయ్ గౌడ్, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వార్డు మెంబర్లు లింగన్న, బెండప్ప గౌడ్, నరసింహులు, సంతోష్‌కుమార్ గౌడ్, వెంకటేష్‌తో పాటు గ్రామానికి చెందిన వంద కుటుంబాలు టీడీపీ చేరాయి. గురువారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి బీవీ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు రఘుమూర్తి స్వామి, బండేగురుస్వామి, కాశీం వలి, డబ్బా ఈరన్న, కురువ వీరేష్‌మహలింగప్ప, శేఖర్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, ఉరుకుంద, రాంగోపాల్, నాగిరెడ్డి, రామన్న గౌడ్, వీరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 25: జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌నకు పట్టణంలోనికి ఆయా ప్రభుత్వ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. నెహ్రూ మెమోరియల్ పాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న ఏ చైత్ర, వి వైష్ణవి, ఉదయ్ కుమార్, కె షేక్షావలి, వీ చైతన్య, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాలకు చెందిన మహేష్, వైష్ణవి, హర్షిత, సెంట్ ఆంథోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న అంజనమ్మ ఎంపికయ్యారు.

చంద్రబాబు సభను జయప్రదం చేయాలి

ఆస్పరి, జనవరి 25: పత్తికొండలో ఈనెల 28న జరిగే చంద్రబాబు నాయు డు రా కదిలిరా పర్యటన జయప్రదం చేయాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శేషాద్రి నాయుడు, మాజీ మండల కన్వీనర్ ఎస్ తిమ్మన్న గురువారం పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ పార్క్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, క్రిష్టప్ప, మల్లేష్, సీతన్న, నాగేంద్ర, రంగస్వామి, నాగన్న, రవి పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

వెల్దుర్తి, జనవరి 25: టీడీపీ పత్తికొండ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అధ్యక్షతన పట్టణంలో శుక్రవారం ‘జయహో బీసీ’ సదస్సు నిర్వహిస్తున్నామని, ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు బలరాంగౌడ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బలరాంగౌడ్ అధ్వ ర్యంలో ముఖ్యనేతల సమావేశం నిర్వహించారు.

మంత్రాలయం: పత్తికొండలో ఈ నెల 28న రా.. కదిలిరా సభను విజయవంతం చేసేందుకు మంత్రాలయంలో శుక్రవారం బీసీ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి చెప్పారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, టీడీపీ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రైతు నూతన ప్రయోగం

డ్రోన్ కెమెరాతో మందు పిచికారి

మద్దికెర, జనవరి 25: రైతుకు వ్యవసాయం కలిసి రావడం లేదు. ఖర్చులు పెరిగిపోయాయి. ఖర్చులు తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో రైతులు కొత్తకొత్త ప్రయోగాలు చేస్తున్నారు. గురువారం మద్దికెర గ్రామానికి చెందిన రైతు నెట్టికంటయ్య తన వ్యవసాయ తోటలో వేరుశనగ పంటలో తెగుళ్ల నివారణకు డ్రోన్ కెమెరాతో మందులు పిచికారి చేయడంతో పలువురు రైతులు చూడడానికి వచ్చారు. రైతు మాట్లాడుతూ డ్రోన్ కెమెరాతో పిచికారి చేయడం వల్ల ఎకరాకు రూ.1000 వరకు ఆదా అవుతుందని, అంతేకా కూలీల ఖర్చు కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.


డ్రోన్ కెమెరాతో మందు పిచికారి చేస్తున్న దృశ్యం

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు


నవరత్నాల రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 25: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి సజీవ సమాధి పొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహా మంగళ హారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. రాఘవేంద్రస్వామి ఇష్టదినమైన గురువారం, గణతంత్ర్య దినోత్సవం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

శ్రీమఠానికి విరాళం

మంత్రాలయం, జనవరి 25: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి ముగ్గురు భక్తులు రూ.7.30 లక్షలు విరాళం ఇచ్చారు. చెన్నైలోని కోయంబత్తూర్‌కు చెందిన శ్రీధరన్ అన్నదానానికి రూ.5 లక్షలు, బెంగళూరుకు చెందిన మరో ఇద్దరు భక్తులు ప్రవీణ్, రమేష్ రూ.2 లక్షలు వస్త్ర సేవ కోసం సంజయన్ రూ.30వేలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. విరాళం ఇచ్చిన భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు స్వామి వారి మెమెంటో, పరిమళ ప్రసాదం, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఆ పత్రికపై చర్యలు తీసుకోవాలి


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 25: అధికార పార్టీకి అనుకూలమైన పత్రికపై చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో టీడీపీ నాయకులు సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, ఉప్పర ఆంజనేయులు, అల్తాఫ్, కందనాతి శ్రీనివాసులు, మల్లికార్జన, పురుషోత్తం రెడ్డి గురువారం ఎస్ఐ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆ పత్రికలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిపై తప్పుడు రాతలు రాశారని ఫిర్యాదు చేశారు. కోట్ల కుటుంబం టీడీపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తప్పుడు వార్త రాశారన్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ-2 రమేష్‌ను విరణ కోరగా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారని, లీగల్ ఒపీనియన్ తీసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రసాభాసగా మారిన ‘ఆడుదాం ఆంధ్ర’

మంత్రాలయం, జనవరి 25: మంత్రాలయం నియోజకవర్గ స్థాయిలో ‘ఆడుదాం ఆంధ్ర’లో భాగంగా జరిగిన క్రీడా పోటీలు రసాభాసగా సాగాయి. ఈ పోటీలు గత రెండు రోజులుగా మంత్రాలయం ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. అయితే వాలీబాల్ పోటీల్లో కోసిగి, మంత్రాలయం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్‌లో మొదటగా మంత్రాలయం జట్టు విజయం సాధించగా.. రెండో విజేతగా కోసిగి జట్టు విజయం సాధించింది. మూడో సెట్ పోటీల్లో హోరాహోరీగా జరుగగా.. మంత్రాలయం 25 పాయింట్లతో విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రకటించడంతో అంపైర్ల నిర్ణయాన్ని తప్పు పట్టిన కోసిగి క్రీడాకారులు నానా రచ్చ చేశారు. అదుపు తప్పుతుందని తెలుసుకున్న ఎంపీడీవో మణిమంజరి, పీఈటీలు సురాజ్, ఈరన్న మంత్రాలయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కిరణ్‌బాబు క్రీడా మైదానానికి చేరుకుని క్రీడాకారులను అక్కడి నుంచి పంపించారు. అలాగే ఖోఖో పోటీల్లో సైతం కోసిగి, మంత్రాలయం జట్ల మధ్య కొద్దిపాటి ఘర్షణ వాతావరణం నెలకొంది.

పొలం విషయంలో ఘర్షణ

మంత్రాలయం, జనవరి 25: మండలంలోని సూగూరు గ్రామంలో పార్థ సారథిరెడ్డి, అదే గ్రామానికి చెందిన బోయ తోల్ల భీమన్న, అతని భార్య బోయ పద్మ మధ్య గురువారం ఘర్షణ జరిగింది. మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాలివీ.. తోల్ల భీమన్న తండ్రి బుడ్డన 1960లో పార్థసారథిరెడ్డికి 5.94 ఎకరాల భూమిని విక్రయించారు. గత మే నెల నుంచి భీమన్న, పద్మమ్మ పొలం తమదేనని చెప్పడంతో ఘర్షణ జరిగింది. ఈ విషయంలో గతంలో మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. గురువారం ఉదయం పార్థసారథిరెడ్డి బైక్‌పై పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా.. భీమన్న, పద్మ ఆయన కళ్లలోకి కారం చల్లి, కట్టెతో కొట్టి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే భీమన్న, పద్మకు కూడా గాయాలైనట్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పార్థసారథిరెడ్డి ఫిర్యాదు మేరకు భీమన్న, పద్మపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బనవాసి విద్యార్థుల ప్రతిభ

ఎమ్మిగనూరు, జనవరి 25: గతేడాది డిసెంబరులో ప్రభుత్వం నిర్వహించిన ఏహెచ్‌పి -2023 ఫలితాల్లో మండలంలోని బనవాసి పశుసంవర్ధక పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. దీంతో గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో 5,7వ ర్యాంకులు సాధించిన రవీంద్ర, వంశీని కళాశాల ప్రిన్సిపాల్ సతీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గురువిష్ణు, ప్రవీణ, కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.